సాక్షి
అనంతపురం

గురువారం । 8 । ఆగస్టు । 2024



చీనీ టన్ను రూ.19 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.19 వేలు పలికాయి.



టీబీ డ్యాం కళకళ

కర్ణాటకలోని టీబీ డ్యాం కళకళలాడుతోంది. జలాశయంలో ప్రస్తుతం 103.780 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

గరిష్టం/కనిష్టం
29.6°/23.8°

జిల్లా అంతటా బుధవారం తుపాను వాతావరణం నెలకొంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

20 మండలాల్లో వర్షం



అనంతపురం అగ్రికల్చర్: చాన్నాళ్ల తర్వాత జిల్లాలో అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 20 మండలాల పరిధిలో 6 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. యాడికిలో 43.2 మి.మీ, గుత్తి 35.2 మి.మీ, కుందుర్పి 30.6 మి.మీ, గుంతకల్లు 13.4 మి.మీ, వజ్రకరూరు 13.2 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక.. పెద్దవడుగూరు, రాయదుర్గం, పామిడి, యల్లనూరు, విడపనకల్లు, కంబదూరు, శెట్టూరు, ఉరవకొండ, తాడిపత్రి, గుమ్మఘట్ట, కళ్యాణదుర్గం, అనంతపురం, పెద్దపప్పూరు, బ్రహ్మసముద్రం, గార్లదిన్నె మండలాల్లో తుంపర్లు పడ్డాయి. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 83.8 మి.మీ కాగా ప్రస్తుతానికి 7.3 మి.మీ నమోదైంది. గత జూన్ ఒకటి నుంచి ఈ ఖరీఫ్‌లో 138.7 మి.మీ గానూ 29 శాతం అధికంగా 179.4 మి.మీ నమోదైంది. 15 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి.

బంద్రా- వేళాంగణి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

గుంతకల్లు: తమిళనాడులో అత్యంత ప్రసిద్ధి గాంచిన వేళాంగణి ఉత్సవాలకు వెళ్లే ప్రయాణికుల దృష్ట్యా బంద్రా–వేళాంగణి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గుంతకల్లులో మాత్రమే స్టాపింగ్ ఉందన్నారు. ఈ నెల 27, సెప్టెంబర్ 6వ తేదీల్లో బంద్రా జంక్షన్ (09093) నుంచి రాత్రి 9.20 గంటలకు బయలుదేరి రెండో రోజు ఉదయం 8.30 గంటలకు రైలు వేళాంగణి చేరుతుందన్నారు. ఈ నెల 29, సెప్టెంబర్ 8వ తేదీల్లో రాత్రి 10 గంటలకు వేళాంగణి జంక్షన్ (09094) నుంచి బయలు దేరి రెండు రోజుల తరువాత మధ్యాహ్నం 3 గంటలకు బంద్రా జంక్షన్ చేరుతుందన్నారు. ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్ బోగీలతోపాటు జనరల్ బోగీలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సొంత జిల్లాకు ఎంపీడీఓలు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



అనంతపురం సిటీ: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇతర జిల్లాలకు వెళ్లిన ఎంపీడీఓలను తిరిగి వారి సొంత జిల్లాలకు పంపుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులను జారీ చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి మొత్తం 38 మంది ఇతర జిల్లాలకు వెళ్లారు. ఇప్పుడు వారంతా సొంత జిల్లాకు రానున్నారు. కర్నూలు జిల్లా నుంచి 34 మంది, నెల్లూరు నుంచి ఒకరు అనంతపురానికి వచ్చారు. వారు తమ జిల్లాలకు వెళ్లిపోనున్నారు.

పోస్టింగ్ కోసం క్యూ..

జిల్లాకు రానున్న ఎంపీడీఓలు మండలాలు వెతుక్కునే పనిలో పడ్డారు. తాము పని చేయాలనుకున్న మండలాలకు సంబంధించి ఆయా ప్రాంత ఎమ్మెల్యేల అనుమతి కోసం వారి ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు నేరుగా, మరికొందరు తెలిసిన వారి నుంచి ఫోన్లు చేయిస్తూ లెటర్లు సంపాదించే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యే లెటర్లు దక్కించుకున్నట్లు తెలుస్తోంది.

నేడు ఎస్ఎంసీ ఎన్నికలు



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని 1,741 ప్రభుత్వ, మునిసిపల్, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్, కేజీబీవీలు, ఎయిడెడ్, మోడల్ స్కూళ్లలో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు జరగనున్నాయి. ఇందు కోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లను చేసింది. ఎస్ఎంసీ ఎన్నికలపై కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పకడ్బందీగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణ బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులదే అని స్పష్టం చేశారు. అన్ని పాఠశాలల్లోనూ కచ్చితంగా ఎన్నికలు జరగాలని డీఈఓ వరలక్ష్మీ, సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు హెచ్ఎంలను ఆదేశించారు. వివాదాలకు తావు లేకుండా సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాలని సూచించారు.

"అనంతపురం క్లబ్బులో పేకాట తీసేసి దాదాపు నాలుగు సంవత్సరాలైంది. ఇక్కడ పేకాట ఆడించేందుకు ఇప్పటికే కలెక్టర్‌తో మాట్లాడా. జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్లబ్‌లలోనూ పేకాట ఆడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడతా....' స్వయాన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఇటీవల ఇచ్చిన భరోసా ఇది. ఓ ఎమ్మెల్యేనే ఇలా మాట్లాడితే పేకాటరాయుళ్లు ఆగుతారా.! వారూ జూలు విదిల్చారు. పేకాట స్థావరాలు నెలకొల్పారు. పేకాటరాయుళ్లకు 'అధికారం' తోడుండడంతో ఖాకీలు కూడా కట్టడి చేయలేకపోతున్నారు. కొంతమంది వారితో కుమ్మక్కై జేబులు నింపుకుంటున్నారు.

అధికార భరోసా..
పేకాట దిలాసా



- కొత్త ప్రభుత్వమొచ్చాక పురివిప్పిన పేకాట భూతం
- లాడ్జీలు, రాష్ట్ర సరిహద్దులు, నగర శివారుల్లో యథేచ్ఛగా నిర్వహణ
- మామూళ్ల మత్తులో కొంత మంది ఖాకీలు
- ఉరవకొండలో పేకాటరాయుళ్లకు అండగా హెడ్ కానిస్టేబుల్
- దాడుల సమాచారం ముందస్తుగా చేరవేస్తూ లబ్ధి పొందుతున్న వైనం

అనంతపురం: జిల్లాలో గత ఐదేళ్లు కానరాని పేకాట భూతం మళ్లీ పురివిప్పింది. ఇప్పటికే అనధికారికంగా టీడీపీ నేతలు జూద, మట్కా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో జోరుగా పేకాట కేంద్రాలు వెలిశాయి. తోటలు, పంట పొలాలు, స్థిరాస్తి వెంచర్లు, ఫామ్‌హౌస్‌ల్లో స్థావరాలు ఏర్పాటు చేసి పేకాట నిర్వహిస్తున్నట్లు తెలిసింది.


నాలుగో కంటికి తెలియకుండా..

పేకాట ఆడేవారికి మినహా ఇతరులకు సమాచారం పొక్కకుండా పేకాట కేంద్రాల నిర్వాహకులు జాగ్రత్త పడుతున్నారు. ఒకరికొకరు సమాచారం అందించుకుని, నిర్దేశించుకున్న స్థలానికి, అనుకున్న సమయానికి చేరుకోవడం వరకే పేకాట ఆడేవారి చేతుల్లో ఉంటుంది. అక్కడి నుంచి నిర్వాహకులు చెప్పినట్లు నడుచుకోవాల్సిందే. పేకాటరాయుళ్లు ఆయా కేంద్రాల్లోనే రోజూ రూ. లక్షల్లో పందేలు కాస్తూ పొద్దుపోయే వరకు ఆ అడ్డాలోనే పేక ముక్కలకు పనిచెబుతున్నారు. అవసరమైతే అక్కడే మద్యం, భోజనం కూడా నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది.

రోజుకు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు..

రాయదుర్గం మండలం టి. వీరాపురం సమీపంలో విచ్చలవిడిగా జూదం నిర్వహిస్తున్నారు. ఇక్కడ రోజూ రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల దాకా పేకాటలో చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. చుట్టుపక్కల మండలాలతో పాటు కర్ణాటక నుంచి చాలా మంది పేకాట ఆడేందుకు వస్తున్నట్లు తెలిసింది. అలాగే డీ.హీరేహాళ్, బొమ్మనహాళ్, రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లోనూ పేకాట జడలు విప్పుకుంది. కొండలు, అటవీ ప్రాంతాల్లో యథేచ్ఛగా సాగుతోంది.

- కుందుర్పి మండలం కొలిమిపాళ్యం, వడ్డేపాళ్యం, శ్రీ మజ్జనపల్లి, ఎనుముల దొడ్డి అటవీ ప్రాంతాల్లో ఇబ్బడిముబ్బడిగా పేకాట స్థావరాలను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాలకు కర్ణాటక నుంచి రోజూ వందకు పైగా జూదరులు వస్తున్నట్లు సమాచారం. బ్రహ్మసముద్రం మండలం వెస్ట్‌కోడిపల్లి, బ్రహ్మసముద్రం, భైరసముద్రం, కోనాపురం గ్రామాల సరిహద్దుల్లో పేకాట జోరుగా సాగుతోంది. శెట్టూరు మండలం తిప్పనపల్లి, లక్ష్మంపల్లి గ్రామాల సరిహద్దులోనూ స్థావరాలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. కంబదూరు మండలంలో మర్రిమాకులపల్లి, కురాకులపల్లి సరిహద్దులో పేకాట విచ్చలవిడిగా నిర్వహిస్తున్నట్లు సమాచారం.



పేకాట స్థావరాలపై ఉక్కుపాదం

కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని ఆంధ్ర భూభాగాల్లో జూదం నిర్వహిస్తున్నారని సమాచారం ఉంది. ఈ మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. రెండు, మూడు రోజుల్లో అందరి ఆట కట్టిస్తాం. పేకాట స్థావరాలపై ఉక్కుపాదం మోపుతాం.

– కేవీ మురళీకృష్ణ, ఎస్పీ

- పేకాట రాయుళ్లకు కొందరు ఖాకీలు అండగా నిలుస్తున్నారు. కేంద్రాల నిర్వాహకులకు అధికార పార్టీ నాయకులు తోడుగా ఉంటుండడంతో మిన్నకుండి పోతున్నారు. ఇదే అదనుగా కొందరు జేబులు నింపుకుంటున్నారు. ఉరవకొండ ప్రాంతంలో ఓ హెడ్‌కానిస్టేబుల్ పేకాట రాయుళ్లతో జత కట్టాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూమూళ్ల వసూళ్లలో ఆరితేరినట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి అదే డివిజన్‌లో పాతుకుపోయిన ఆయన.. ఉన్నతాధికారులు వేరే ప్రాంతాలకు బదిలీ చేసినా, కొన్ని రోజుల్లోనే తిరిగి ఉరవకొండకు బదిలీ చేయించుకుని అసాంఘిక కార్యకలాపాలకు మద్దతు ఇస్తున్నట్లు తెలిసింది.

పల్మనరీ విభాగానికి ఐదు పీజీ సీట్లు

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు



ప్రిన్సిపాల్ మాణిక్యరావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న డాక్టర్ రామస్వామి

అనంతపురం మెడికల్: అనంతపురం బోధనాస్పత్రి పల్మనరీ విభాగానికి కొత్తగా ఐదు పీజీ సీట్లు మంజూరైనట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. దీంతో వైద్య కళాశాలలో పీజీ సీట్ల సంఖ్య 117కు చేరిందన్నారు. బుధవారం కళాశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా బోధనాస్పత్రికి పీజీ సీట్లు గణనీయంగా పెరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం అనాటమీ 9, ఫిజియాలజీ 4, బయోకెమిస్ట్రీ 2, పెథాలజీ 4, మైక్రో బయాలజీ 11, ఫార్మకాలజీ 7, ఫోరెన్సిక్ మెడిసిన్ 2, ఎస్‌పీఎం 3, జనరల్ మెడిసిన్ 9, జనరల్ సర్జరీ 8, ఆర్థోపెడిక్స్ 7, గైనకాలజీ 12, పీడియాట్రిక్ 4, డెర్మటాలజీ 4, సైకియార్టీ 2, ఈఎన్‌టీ 3, ఆప్తమాలజీ 3, రేడియాలజీ 12, అనస్తీషియా 6 పీజీ సీట్లు ఉన్నాయన్నారు. మూడు సంవత్సరాల పాటు 351 మంది పోస్టు గ్రాడ్యుయేట్స్ వైద్యులు విద్యనభ్యసించేందుకు వీలుగా ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావులకు ఈ సందర్భంగా పల్మనరీ విభాగాధిపతి డాక్టర్ రామస్వామి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పల్మనరీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్యలక్ష్మి, డాక్టర్ కావేటి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు 8వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ సంవత్సర ఆదాయం రూ. 3.5 లక్షలలోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఈ ఏడాది డిసెంబరు 8న పరీక్ష ఉంటుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ. 50 చెల్లించాల్సి ఉంటుందన్నారు.ఆన్‌లైన్‌లో సెప్టెంబరు 6లోగా దరఖాస్తు చేసుకోవాలని, పరీక్ష ఫీజు సెప్టెంబరు 10లోగా ఎస్‌బీఐ కలెక్ట్ లింకు ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. అనంతపురం కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయంలో ఉన్న పరీక్షల విభాగంలోనూ సంప్రదించవచ్చన్నారు.

గడువులోపు ఈ–క్రాప్ పూర్తి చేయండి

అనంతపురం అగ్రికల్చర్: ఈ–క్రాప్, ఈ కేవైసీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా చేపట్టాలని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రభుత్వ కార్యదర్శి రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావు ఆదేశించారు. బుధవారం వారు గుంటూరు నుంచి జేడీఏ, ఏడీఏ, ఏఓలు, ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు, అలాగే ఉద్యానశాఖ, పట్టు పరిశ్రమశాఖ, మత్స్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ–క్రాప్‌కు అత్యంత ప్రాధాన్యత ఉన్నందున భవిష్యత్తులో రైతులకు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ క్రయ విక్రయాలకు ఈ–క్రాప్ ప్రామాణికం కావడంతో వందశాతం కచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. నిజమైన సాగుదారులను పరిగణనలోకి తీసుకుని పంట నమోదు ప్రక్రియ చేపట్టాలన్నారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో తగిన జాగ్రత్తలు తీసుకుని గడువులోపు విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.

అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలవ్వాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే శ్రావణి శ్రీ

అనంతపురం అర్బన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఎస్పీ మురళీకృష్ణతో కలిసి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసు నమోదు విషయంలో సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సందర్శక గంటలు పాటించాలని చెప్పారు. ఎస్పీ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలు, మండలాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. శింగనమల నియోజకవర్గ పరిధిలో 72 ఎస్సీ, ఎస్టీ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఆర్‌డీఓలు వసంత బాబు, రాణిసుస్మిత, శ్రీనివాసులురెడ్డి, ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

పంద్రాగస్టు వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఎస్పీ మురళీకృష్ణ, డీఆర్‌ఓ జి. రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలు ప్రతిబింబించేలా శకటాలు, స్టాళ్లు ఉండాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచిన అధికారులు, సిబ్బందికి అవార్డుల ప్రదానం ఉంటుందన్నారు. ప్రధానంగా ఎన్నికల సమయంలో బాగా పనిచేసిన వారిని గుర్తించాలని ఆదేశించారు. స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలకు సన్మాన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా హర్ ఘర్ తిరంగా అంటూ ఈ నెల 13 వరకూ 'మేరీ మాటి మేరీ దేశ్' క్యాంపెయిన్ కింద కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక

విజన్ ఆంధ్ర–2047లో భాగంగా జిల్లా అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. అధికారులతో ఆయన మాట్లాడుతూ 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక, ఏడాది కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి గురువారం అందించాలన్నారు. ఇందుకు నోడల్ అధికారిగా సీపీఓని నియమించామన్నారు.

భూముల రీ సర్వేపై నీలినీడలు

- ఇప్పటికే 198 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసిన అధికారులు
- కొత్త ప్రభుత్వం రావడంతో ప్రాజెక్టుపై ఉలుకూ పలుకూ లేదు
- వందేళ్ల రికార్డులు ప్రక్షాళన చేయడంతో వివాదాలు కొలిక్కి
- పటిష్ట భూ రికార్డుల రూపకల్పనతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం
- కూటమి ప్రభుత్వం ఎటూ తేల్చకపోవడంతో సందిగ్ధం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: వంద సంవత్సరాల నుంచి భూ వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. వివాదాలతో గ్రామాలకు గ్రామాలే కోర్టుల చుట్టూ తిరుగుతూ లక్షలాది రూపాయలు భరిస్తున్న పరిస్థితి. కొన్ని ఊళ్లలో అన్నదమ్ముల మధ్య భూ తగాదాలతో భూములనే బీళ్లుగా మార్చుకున్న దుస్థితి. ఈ పరిస్థితులను పూర్తిగా అధిగమించి వివాదాలు లేని భూమి హద్దులను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం భూముల రీ సర్వే చేపట్టింది. 2024 మార్చి వరకూ అంటే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకూ జిల్లాలో భూముల రీసర్వే ముమ్మరంగా కొనసాగింది. కానీ కూటమి ప్రభుత్వం రాగానే ఈ ప్రాజెక్టును పూర్తిగా పక్కనపెట్టింది. భూముల రీ సర్వే కోసం వందలాది మంది డిప్యూటీ తహసీల్దార్లు రేయింబవళ్లు పనిచేశారు. ఈ దశలో సమసిపోతాయనుకున్న వివాదాలు మళ్లీ కూటమి ప్రభుత్వ నిర్ణయంతో మొదటికొచ్చాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

మూడేళ్ల శ్రమ బూడిదలో పోసిన పన్నీరే..!

వందలాది మంది రెవెన్యూ సిబ్బంది, 140కి పైగా డ్రోన్ కెమెరాలు, గూగుల్ మ్యాప్‌లతో గుర్తించి మరీ భూ హద్దులు గుర్తించేందుకు టెక్నికల్ అసిస్టెంట్లు .. నిత్యం కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓల పర్యవేక్షణతో మహా యజ్ఞంలా సాగుతున్న ప్రాజెక్టును కూటమి ప్రభుత్వం అధఃపాతాళానికి తొక్కింది. భవిష్యత్తులో భూ వివాదాలు లేని గ్రామాలను చూడాలన్న కలను తుంచేశారని పలువురు వాపోతున్నారు. ఎలాంటి భూ ఆక్రమణలకు తావు లేకుండా, పక్కా ఆధారాలతో ఎల్‌పీ (ల్యాండ్ పొజిషన్) నంబర్లు జారీ చేసే ప్రక్రియ జరిగింది. మరో ఆరుమాసాల్లో అనంతపురం జిల్లాలో ఉన్న మొత్తం గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యేది. కానీ ఇంతలోనే కూటమి ప్రభుత్వం రావడంతో ఒక్కసారిగా ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు పరిస్థితి పూర్తిగా సందిగ్ధంలో పడింది.

ఇప్పటికీ తేల్చని ప్రభుత్వం..

కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు మాసాలు కావొస్తోంది. రీసర్వే చేసిన గ్రామాల్లో ఇప్పటికే 1.25 లక్షల హద్దు రాళ్లు పాతారు. నాలుగో దశలో మరి కొన్ని గ్రామాల్లో రీసర్వే చేపట్టే దశలోనే ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనిపై ఇప్పటివరకూ ఎలాంటి నిర్ణయమూ తీసుకోకపోవడంతో ప్రాజెక్టుపై నీలినీడలు కమ్ముకున్నాయి. దశాబ్దాలుగా కొనసాగిన వివాదాలు ఇక ఉండవని అనుకున్న రైతులను ఈ ప్రభుత్వం మళ్లీ ఇబ్బందులు పెడుతోంది. ప్రాజెక్టుపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోవపోవడంతో మళ్లీ భూ దందాలు మొదలైనట్టు బాధితులు వాపోతున్నారు. ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి భూములను ఆక్రమించుకుంటున్న పరిస్థితి నెలకొంది.

జిల్లాలో రీ సర్వే ఇలా..

రీ సర్వే చేసిన గ్రామాలు	198
రీ సర్వే జరిగిన సర్వే నంబర్లు	48,689
ఫీల్డ్ వెరిఫికేషన్ చేసిన రికార్డులు	75,301
ఎల్‌పీ నంబర్ల జారీ	88,992
సర్వే చేసిన ఎకరాలు	5,88,610
హద్దులకు పాతిన రాళ్లు	1,24,275

రీ సర్వే ప్రక్రియ నిలిపి వేశాం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో భూముల రీ–సర్వే ప్రక్రియ నిలుపుదల చేశాం. సర్వేపై ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా ముందుకు వెళతాం. అప్పటివరకు రీ– సర్వేకు సంబంధించి ఎలాంటి కార్యక్రమాలు చేపట్టం.

– రూప్లానాయక్, ఏడీ, సర్వే, భూ రికార్డుల శాఖ

10న జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక



అనంతపురం: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఈ నెల 10న జిల్లా హ్యాండ్‌బాల్ జూనియర్ (అండర్–19) బాలుర, బాలికల జట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీ రమణా రెడ్డి, కార్యదర్శి ఎస్ఎండీ రఫీయుద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 46వ ఏపీ స్టేట్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ ఫర్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు. పూర్తి వివరాలకు 9949942494, 8639138569 నంబర్లలో సంప్రదించవచ్చు.

రాగులపాడు ఎత్తిపోతలకు కృష్ణా జలాలు

వజ్రకరూరు: హంద్రీనీవా ద్వారా మండలంలోని రాగులపాడు వద్దకు మంగళవారం రాత్రి కృష్ణా జలాలు చేరుకున్నాయి. అక్కడి నుంచి రెండు పంపుల ద్వారా అధికారులు నీటి పంపింగ్ ప్రారంభించారు. దీంతో కృష్ణా జలాలు జీడిపల్లి రిజర్వాయర్ వైపు పరుగులు తీస్తున్నాయి. రాగులపాడు లిఫ్ట్ నుంచి 565 క్యూసెక్కుల మేర నీటిని పంపింగ్ చేస్తున్నట్లు హంద్రీనీవా ఏఈ హమ్‌దాన్ వెల్లడించారు. కృష్ణమ్మ రాకతో భూగర్భ జలాలు పెరగనున్నట్లు రైతులు పేర్కొన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి హంద్రీనీవా పథకానికి రూ. వేల కోట్లు కేటాయించి కాలువ పనులను పూర్తి చేయడం వల్లే నేడు జిల్లాకు కృష్ణా జలాలు వస్తున్నాయని పలువురు గుర్తు చేసుకున్నారు.



రాగులపాడు వద్ద నీటిని పంపింగ్ చేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

టీడీపీ కార్యకర్తల ఇసుక దందా


పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పరు

శింగనమల: మండలంలో టీడీపీ నాయకులు సాగిస్తున్న ఇసుక దందా గుట్టును సెబ్ పోలీసులు రట్టు చేశారు. వివరాలు.. శింగనమల మండలం ఉల్లికల్లుకు చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలు అక్రమంగా ఇసుకను జేసీబీ సాయంతో తవ్వి టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఇరువెందల సమీపంలోని వంక నుంచి రాత్రి సమయంలో ఏకధాటిగా ఇసుకను తరలించే క్రమంలో రైతులు తోటలకు వేసుకున్న పైప్‌లైన్లు పగిలిపోయాయి. దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఇసుక తరలింపులపై సెబ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం రాత్రి సెబ్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పట్టుబడిన ఓ టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో ఉల్లికల్లుకు చెందిన టీడీపీ నాయకులు కొందరు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి బలవన్మరణం

గార్లదిన్నె: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన సూర్యనారాయణరెడ్డి (43) అనంతపురంలోని జొన్నా ఐరన్ మార్ట్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తనకున్న ఇద్దరు పిల్లల చదువులు, అనారోగ్యంతో బాధపడుతున్న భార్య సుజాత చికిత్స కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశాడు. సకాలంలో అప్పులు చెల్లించకపోవడంతో వడ్డీలకు వడ్డీల భారం పెరిగి రూ.10 లక్షలకు చేరుకుంది. ఈ క్రమంలో అప్పు చెల్లించాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు మొదలయ్యాయి. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక మదనపడిన ఆయన జీవితంపై విరక్తితో మంగళవారం రాత్రి ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

9న ఆదివాసీ దినోత్సవం

అనంతపురం రూరల్: ఈ నెల 9న జిల్లాలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజినేయులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పాతూరులోని గిరిజన భవన్‌లో కార్యక్రమాలు ఉంటాయి. జిల్లాలోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గిరిజన సంఘాల నాయకులు, ప్రజలను ఆయన కోరారు.

పెద్ద మేడం పచ్చపాతం

- ఏకపక్ష నిర్ణయాలతో అధికార పార్టీకి తొత్తుగా మారిన డీఈఓ
- టీడీపీ భావజాలం గిట్టని ఉపాధ్యాయులే లక్ష్యంగా వేధింపులు
- వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడిపై అకారణంగా సస్పెన్షన్ వేటు
- టీడీపీ అభ్యర్థితో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీచర్లపై చర్యలు శూన్యం
- గత ప్రభుత్వంలో బాధ్యతలు చేపట్టారనే సాకుతో బలవంతంగా సెక్టోరియల్ అధికారుల రిలీవ్
- కలెక్టర్‌ను బురిడీ కొట్టిస్తూ ఆయనతోనే తప్పుడు ఫైళ్లపై సంతకాలు
- విద్యాశాఖ కమిషనర్, ఎస్పీడీ ఉత్తర్వులు బేఖాతరు

కుటుంబసభ్యులకు ఏ చిన్న ఇబ్బంది కలిగినా ఇంటి పెద్దగా తల్లిదండ్రులు వెంటనే స్పందిస్తారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటారు. అలాగే ఓ ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖ జిల్లా అధికారి చొరవ తీసుకోవడం సర్వసాధారణం. ఉద్యోగుల్లో భిన్న మనస్తత్వాలు ఉన్నా... అందరికీ సర్దిచెబుతూ హుందాగా వ్యవహరిస్తుంటారు. అయితే ఇందుకు భిన్నమైన వైఖరి జిల్లా విద్యాశాఖలో నెలకొంది. ఏకపక్ష నిర్ణయాలతో ఉద్యోగులను డీఈఓ వేధింపులకు గురిచేస్తుండడం ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఆ శాఖ ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది.



డీఈఓ కార్యాలయం (ఇన్‌సెట్‌లో) డీఈఓ బి.వరలక్ష్మి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి అధికార పార్టీకి తొత్తుగా మారారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ భావజాలం గిట్టని టీచర్లను లక్ష్యంగా చేసుకుని వేధిస్తుండడం వివాదాస్పదమవుతోంది. ఏదైనా అడిగితే 'నాయనా... ఇది కలెక్టర్ నిర్ణయం... నా చేతుల్లో ఏమీ లేదు' అంటూ నెపం కలెక్టర్‌పై నెట్టేస్తుండడం గమనార్హం.

ఎస్పీడీ ఉత్తర్వులూ డోంట్‌కేర్

ఇటీవల సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాదరావు ఉద్యోగ విరమణ పొందడంతో డీఈఓ వరలక్ష్మికి ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు ఇస్తూ స్వయంగా స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను బేఖాతరు చేసిన ఆమె కలెక్టర్‌తో మరోవిధంగా చెప్పి ఆ బాధ్యతలు తీసుకోకుండా తప్పించుకున్నారు. అయితే ఈ విషయం ఎస్పీడీ దృష్టికి తీసుకెళ్లలేదని తెలిసింది. అంతే కాక విద్యాశాఖలో ఆమె తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతుండడంతో ఉపాధ్యాయులు చిక్కుల్లో పడుతున్నారు.

వేధింపుల్లో మచ్చుకు కొన్ని..

- కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం కుర్లగుండ గ్రామ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రాఘవేంద్ర గుప్త, నాగిరెడ్డిపల్లి టీచరు వై.మంజునాథ్ ఇద్దరూ గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సురేంద్రబాబుకు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఎంఈఓ ఓబుళపతి టీచర్లకు వ్యక్తిగతంగా అందజేయాల్సిన పోస్టల్ బ్యాలెట్లను ఆ ఇద్దరు టీచర్లకు గంపగుత్తగా ఇచ్చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వీరిపై ఇప్పటి వరకూ కనీస చర్యలు తీసుకోలేదు.
- గత ప్రభుత్వంలో వచ్చారనే ఒకే ఒక్క కారణంగా సమగ్ర శిక్ష సెక్టోరియల్ ఆఫీసర్లను తప్పించేందుకు కంకణం కట్టుకున్నారు. ఈ విషయంలో స్వయంగా విద్యాశాఖ కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులకు వక్రభాష్యం చెప్పారు. విద్యా సంవత్సరం మధ్యలో రిలీవ్ చేయొద్దని కమిషనర్ స్పష్టంగా పేర్కొన్నా... కలెక్టర్‌ను తప్పుదోవ పట్టించి ఆయనే చర్యలు తీసుకునేలా చేశారు. వాస్తవానికి సమగ్ర శిక్షలో మూడు సెక్టోరియల్ పోస్టులు ఖాళీ కానున్నాయి. వీటి కోసం కొందరు టీడీపీ ప్రజాప్రతినిధుల సిఫార్సుతో దరఖాస్తు చేసుకున్నారు. డీఈఓ మరో అడుగు ముందుకేసి ప్రస్తుతం ఉన్న వారందరినీ ఒకేమారు రిలీవ్ చేసేలా పక్కాగా ప్లాన్ చేశారు. తన స్వార్థం కోసం ఓ సీనియర్ అసిస్టెంట్ సైతం ఇందులో ప్రధాన భూమిక పోషించడం గమనార్హం.
- సీనియర్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియ డీఈఓ పరిధిలోనే ఉంటుంది. అలాంటిది వారిని కూడా కలెక్టర్‌తోనే రిలీవ్ చేయించేలా పావులు కదిపారు. ఎవరైనా అడిగితే 'కలెక్టర్ తీసుకున్న నిర్ణయం' అంటూ చేతులెత్తేశారు. ఈ వ్యవహారంపై కలెక్టర్ గుర్రుగా ఉన్నారు.
- తన సామాజిక వర్గానికి చెందిన ఓ తెలుగు పండిట్ చీటీల పేరుతో రూ.10 కోట్ల వరకు కుచ్చుటోపీ పెడితే ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిత్వం నిర్వహించిన మరో టీచరు ద్వారా డీఈఓకు భారీగానే లబ్ధి చేకూరిందని ఆ శాఖ ఉద్యోగులే బాహాటంగా విమర్శిస్తున్నారు.
- వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి ఓ సాధారణ టీచరే. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారంటూ కక్ష కట్టి మరీ ఇబ్బంది పెడుతున్నారు. పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్‌కు సంబంధించి అప్పటి జగన్ ప్రభుత్వం రెమ్యూనరేషన్ పెంచడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. దీనిని మహా అపరాధంగా గుర్తిస్తూ సస్పెన్షన్ వేటు వేశారు. వాస్తవానికి అశోక్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేసిన అంశం ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్లడంతో ఆ ఫిర్యాదును జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టర్)కి పంపారు. ఈ అంశాన్ని పరిశీలించమని డీఈఓను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ నిర్ణయాన్ని వరంగా మార్చుకున్న ఆమె వెనుకాముందు ఆలోచించకుండా అశోక్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ అంశంలోనూ తన చేతులకు మట్టి అంటకుండా జాగ్రత్త పడ్డారు. కలెక్టర్ ద్వారానే మొత్తం పనంతా చక్కబెట్టించారు.
- అదే ఎన్నికల సమయంలో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించిన ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఇద్దరిపై సస్పెన్షన్ వేటు పడింది. వీరిలో ఒకరు కోర్టుకెళ్లడంతో సస్పెన్షన్ ఎత్తివేశారు. ఆ తర్వాత మరొకరిపై కూడా సస్పెన్షన్ ఎత్తివేశారు. కానీ అశోక్‌కుమార్‌రెడ్డిపై మాత్రం సస్పెన్షన్ అలాగే కొనసాగిస్తున్నారు.
- డీఈఓ కార్యాలయ సిబ్బంది చేసిన తప్పునకు ఓ టీచరు బలైంది. పదోన్నతుల్లో వారు చూపించిన ఖాళీ స్థానాన్ని కోరుకున్నారు. అయితే అక్కడ పోస్టు లేకపోవడంతో అప్పటి డీఈఓ... తాత్కాలికంగా జీతం కోసం జిల్లా సరిహద్దు మండలంలోని స్కూల్ కేటాయించి పని మాత్రం జిల్లా కేంద్రం సమీపంలో చేయిస్తున్నారు. అయితే ఆమెకు నేటికీ పర్మినెంట్ స్థానం కేటాయించకపోగా ప్రస్తుతం పని చేస్తున్న స్కూల్ నుంచి సైతం రిలీవ్ చేయించారు. జీతం తీసుకుంటున్న స్కూల్‌కు వెళ్లాలని చెబుతున్నారు. ఆఫీస్ వాళ్లు చేసిన తప్పునకు తనను బలి చేస్తున్నారని వేడుకున్నా... డీఈఓ మాత్రం రాజకీయ పార్టీ ముద్ర వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

నా పైనే ఫిర్యాదు చేస్తావా?

డీఈఓ కక్షగట్టి మరీ తమను వేధిస్తుండడంతో విసుగు చెందిన కొందరు నేరుగా కలెక్టర్‌ను కలిసి విన్నవించుకుంటున్నారు. అలాంటి ఓ టీచరును 'నా పైనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తావా?. నీ సంగతి తేలుస్తా' అని బహిరంగంగానే డీఈఓ హెచ్చరించినట్లు తెలిసింది. ఈ అంశం కాస్త ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తెలియడంతో 'కలెక్టర్‌ను కలిస్తే తప్పేంటి' అంటూ ప్రశ్నిస్తున్నారు. సామాన్య టీచర్లు, ఉద్యోగులపై డీఈఓ కక్ష సాధింపు చర్యలు తారాస్థాయికి చేరుకోవడంతో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సిద్ధమవుతున్నారు.

పక్కాగా పశుగణన


మాట్లాడుతున్న పశుశాఖ జేడీ సుబ్రహ్మణ్యం

అనంతపురం అగ్రికల్చర్: సెప్టెంబర్ ఒకటి నుంచి మొదలు కానున్న పశుగణన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పక్కా గణాంకాలు నమోదు చేయాలని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం సూచించారు. పశు గణన అంశంపై ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు స్థానిక పశుశాఖ కార్యాలయంలో బుధవారం శిక్షణా కార్యక్రమంలో ఏర్పాటు చేశారు. డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, నోడల్ అధికారి డాక్టర్ వెంకటనాయుడు, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ గోల్డ్‌స్మెన్ తదితరులతో కలసి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. పశుగణనలో చేపట్టాల్సిన విధులు, బాధ్యతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గ్రామాల వారీగా షెడ్యూల్, యాప్‌లో ఎలా నమోదు చేయాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, పందులు, గాడిదలు, గుర్రాలు, ఏనుగులు, ఒంటెలు... ఇలా జిల్లా వ్యాప్తంగా ఏ రకం జంతువులున్నా వాటి వివరాలు పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ గణాంకాలు వచ్చే రెండు మూడేళ్లకు పథక నిర్దేశన, బడ్జెట్ కేటాయింపులకు ఉపయోగపడుతుందన్నారు.

శాస్త్రీయ విద్యా విధానంతోనే దేశాభివృద్ధి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్


ప్లీనరీ సమావేశంలో ఐక్యతను చాటుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉరవకొండ: శాస్త్రీయ విద్యా విధానంతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ అన్నారు. బతకడానికి అవసరమైన విద్యా విధానం అమలులోకి రావాలని ఆకాంక్షించారు. ఉరవకొండ వేదికగా సాగిన ఎస్ఎఫ్ఐ 32వ ప్లీనరీ సమావేశాలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. సమావేశం చివరి రోజు పలు కీలక అంశాలపై చర్చించి, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణను రూపొందించారు. స్థానిక తొగట వీర కల్యాణ మంటపంలో జరిగిన ఈ సమావేశాలకు 300 మంది ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు హాజరయ్యారు. ఆ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ... విద్యారంగ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవడం లేదని మండిపడ్డారు. సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, వెంటనే కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలన్నారు. ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించాలన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సిద్ధు, కార్యదర్శిగా పరమేష్, బాలికల విభాగం కన్వీనర్‌గా రజిత, ఉపాధ్యక్షులుగా తరిమెల గిరి, వంశీ, వెంకీ, సహాయ కార్యదర్శిగా రాచేపల్లి సూర్యప్రకాష్, భీమ, శివతో పాటు 20 మంది సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు.

వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని పరిశీలించిన ఐఎస్ఓ ప్రతినిధులు


జేడీఏ, ఇతర అధికారులతో సమావేశమైన ఐఎస్ఓ ప్రతినిధులు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని బుధవారం ఉదయం ఐఎస్ఓ ప్రతినిధులు పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఐఎస్ఓ సర్టిఫికెట్ పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలపై జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఇతర అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఎస్ఓ ప్రతినిదులు ప్రసాద్, సింగయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

రాయదుర్గంటౌన్: ప్రియుడు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... స్థానిక రాజీవ్‌గాంధీ కాలనీకి చెందిన మోహన్ అదే ప్రాంతానికి చెందిన పార్వతి (40)తో వివాహేతర సంబంధం కొనసాగించేవాడు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా ఆమెకు దూరంగా ఉంటూ వచ్చిన మోహన్... మంగళవారం సాయంత్రం పార్వతిపై పెట్రోల్‌పోసి నిప్పంటించాడు. ఘటనలో దాదాపు 70 శాతం కాలిన గాయాలతో అనంతపురంలోని సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె బుధవారం మధ్యాహ్నం మృతి చెందింది. కాగా, ఘటనకు సంబంధించి రాయదుర్గం ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స పొందుతున్న సమయంలోనే రాయదుర్గం జడ్జి వద్ద ఆమె ఇచ్చిన వాఙ్మూలం మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

టీచర్ల సర్దుబాటు జిల్లాస్థాయిలోనే జరగాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల సర్దుబాటు ప్రక్రియ రాష్ట్ర స్థాయిలో జరపాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకుని జిల్లా స్థాయిలోనే చేపట్టాలని కూటమి ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహులు మాట్లాడుతూ... గతంలో సర్దుబాటు ఉపాధ్యాయులకు ఇబ్బందులు తలెత్తితే జిల్లా, మండల స్థాయి అధికారులు చొరవ తీసుకుని పరిష్కరించేవారన్నారు. ఇప్పుడు ఆ అవకాశం కూడా ఇవ్వకుండా కమిషనరేట్ నుంచి నిర్వహించడం సరికాదన్నారు. అంతేకాక 10 మంది విద్యార్థుల లోపు ఉన్న పాఠశాలలను మూసివేసే ప్రయత్నం కూడా చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఇది విద్యారంగానికి, పాఠశాలల మనుగడకు తీవ్ర హాని చేసే నిర్ణయమన్నారు. జీఓ 117ను రద్దు చేస్తామని ప్రకటించి ఇప్పటిదాకా ఆ ప్రయత్నం చేపట్టకపోవడం బాధాకరమన్నారు. 12వ పీఆర్సీ జూలై 23 నుంచి అమలు కావాల్సి ఉన్నా ఇంతవరకూ ఎలాంటి ప్రకటన లేదన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాయల్ వెంకటేష్, ఎస్.సిరాజుద్దీన్ మాట్లాడుతూ... అన్ని గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు రమణ, సర్దార్ వలి, ఆడిట్ కమిటీ కన్వీనర్ వన్నప్ప, నాయకులు తిప్పేస్వామి, రామ్మూర్తి, నాగరాజు, బాలాజీ పాల్గొన్నారు.

గ్రామీణ రహదారుల పరిశీలనకు నేడు ప్రత్యేక బృందం రాక

అనంతపురం సిటీ: ఏపీ రూరల్ రోడ్ ప్రాజెక్ట్ (ఏపీఆర్ఆర్‌పీ) పనుల పరిశీలనకు ప్రాజెక్ట్ అడ్వైజర్ కె.ప్రభాకర్‌రెడ్డి, సహాయక అడ్వైజర్ నరసింహారావు గురువారం ఉదయం జిల్లాకు రానున్నారు. విజయవాడ నుంచి రైలులో అనంతపురం చేరుకున్న వారు... క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి సాయంత్రం వరకూ గ్రామీణ ప్రాంత రహదారుల నిర్మాణాలను పరిశీలించనున్నారు. మరుసటి రోజు(శుక్రవారం) అనంతపురంలోని బుడ్డప్పనగర్‌లో ఉన్న పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో పీఆర్ ఎస్ఈ, పీఆర్, పీఐయూ ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు, సెక్షన్ ఆఫీసర్లతో సమావేశం కానున్నారు.

నీటి దోనెలో పడి వ్యక్తి మృతి


చిన్నలాల్‌స్వామి (ఫైల్)

యాడికి: ప్రమాదవశాత్తు నీటి దోనెలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... యాడికి పంచాయతీ వార్డు సభ్యుడు తిరుపతి చెల్లెలు శాంతికి పదేళ్ల క్రితం పెద్దవడుగూరు మండలం రావులుడికి గ్రామానికి చెందిన చిన్న లాల్ స్వామి (33)తో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రావులుడికిలోనే చిన్న దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న లాల్ స్వామి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయం కాలేదు. దీంతో దేవుడిపై భారంపై వేసి ఆలయాలకు ఒంటరిగా వెళ్లి పూజలు చేసి వచ్చేవాడు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం యాడికి మండలం చందన గ్రామ సమీపంలోని రామలింగేశ్వరుడి దర్శనానికి వచ్చిన ఆయన పూజాదికాలు ముగించుకున్న అనంతరం ఆలయంలోనే బస చేశాడు. బుధవారం 3 గంటల సమయంలో ఆలయం వెనుక ఉన్న దోనె వద్దకు వెళ్లిన అర్చకుడు నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అక్కడ ఉన్న సంచిలో ఉన్న ఫోన్, ఇతర పేపర్ల ద్వారా మృతుడిని చిన్నలాల్‌స్వామిగా గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సీపీఐ సీనియర్ నేత ఎంవీ రమణ ఇక లేరు



అనంతపురం అర్బన్: సీపీఐ సీనియర్ నేత ఎంవీ రమణ ఇక లేరు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. ప్రస్తుతం ఆయన సీపీఐ రాష్ట్ర సమితి ప్రత్యేక ఆహ్వానితులుగా కొనసాగుతున్నారు. సీపీఐలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమానికి కన్వీనర్‌గా నాయకత్వం వహించారు. జిల్లాపార్టీ కార్యదర్శిగా, రాష్ట్ర సమితి సభ్యులుగా, కంట్రోల్ కమిషన్ సభ్యులుగా పనిచేశారు. ఆయన అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు.

ఏ ఒక్క మొండి బకాయినీ వదలం


బ్యాంక్ రికార్డులు పరిశీలిస్తున్న అరుణకుమారి

ఉరవకొండ: ఉరవకొండ కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పరిధిలోని ఏ ఒక్క మొండి బకాయినీ వదలపెట్టబోమని, అందరి చేత చట్టపరంగా వసూలు చేసి తీరుతామని ఆ బ్యాంకు లిక్విడేటర్, జిల్లా సహకార సంఘాల అధికారి ఈ.అరుణకుమారి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక పాత గాంధీచౌక్ వద్ద ఉన్న టౌన్ బ్యాంకు కార్యాలయంలో లిక్విడేటర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మాట్లాడారు. ఏపీ సహకార కమిషనర్, రిజిస్ట్రార్ కోఆపరేటివ్ సొసైటీ వారి ఆదేశాల మేరకు లిక్విడేటర్‌గా బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపారు. తగిన మూలధనం, సంపాదన అవకాశాలు లేకపోవడంతో బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్టు 1949లోని సెక్షన్ 56లో కింద ఉరవకొండ టౌన్ బ్యాంకు లైసెన్స్ ఆర్‌బీఐ రద్దు చేసిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో బ్యాంక్ రికార్డులన్నీ పరిశీలించిన అనంతరం రూ.1.64 కోట్ల మేర మొండి బకాయిలు ఉన్నట్లుగా తేలిందన్నారు. వీటిని చట్టపరంగా వసూలు చేస్తామన్నారు. అవసరమైతే మొండి బకాయిదారుల ఆస్తులు జప్తు చేస్తామన్నారు. బ్యాంకు పరిధిలో డిపాజిట్‌దారులకు చెల్లించాల్సిన డబ్బు మొత్తం చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అంశంపై ఎలాంటి సందేహాలు పడాల్సిన అవసరం లేదన్నారు. బ్యాంకు రికార్డులన్నీ ఆడిట్ చేసిన అనంతరం రికవరీలు ప్రారంభిస్తామన్నారు.

సామాజిక బాధ్యత కలిగి ఉండాలి


రెడ్‌క్రాస్ ప్రతినిధులకు సభ్యత్వ రుసుము అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత కలిగి ఉండాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం హర్షణీయమన్నారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో 601 మంది ఐసీడీఎస్ ఉద్యోగులు రెడ్‌క్రాస్ సభ్యులుగా చేరారు. ఇందుకు సంబంధించి వసూలైన రూ.3,20,150 సభ్యత్వ రుసుమును బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రెడ్‌క్రాస్ ప్రతినిధులకు కలెక్టర్ అందజేశారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవిని అభినందించారు. రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని ప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, గుత్తి సీడీపీఓ దిల్లీశ్వరి, రెడ్‌క్రాస్ కార్యదర్శి మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

'అనంత' మార్కెట్ కమిటీ దూకుడు



అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన ఫీజు వసూళ్లలో అనంతపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ దూకుడు ప్రదర్శిస్తోంది. అయితే ఇందుకు భిన్నంగా రాప్తాడు, గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం కమిటీలు పూర్తి వెనుకంజలో ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 9 మార్కెట్‌యార్డులు, 15 చెక్‌పోస్టుల ద్వారా వివిధ రూపాల్లో రూ.12.06 కోట్ల మేర పన్ను వసూళ్లు చేయాలని లక్ష్య నిర్దేశన చేశారు. అయితే జూలై ఆఖరుతో ముగిసిన నాలుగు నెలల కాలంలో ఓవరాల్‌గా 30 శాతంతో రూ.3.56 కోట్లు వసూలైంది.

45 శాతంతో 'అనంత' ముందంజ

ఈ ఏడాది అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రూ.4.60 కోట్లు లక్ష్యం విధించగా 45 శాతంతో రూ.2.07 కోట్లు వసూళ్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో శింగనమల, ఉరవకొండ మార్కెట్ కమిటీలు 30 శాతంతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి. కళ్యాణదుర్గం, తాడిపత్రి కమిటీలు 23 శాతం వసూళ్లతో సంయుక్తంగా మూడో స్థానంలో కొనసాగుతున్నాయి. ఈ ఐదు కమిటీలు లక్ష్యం దిశగా పయనిస్తుండగా మిగిలిన రాప్తాడు, గుత్తి, గుంతకల్లు, రాయదుర్గం కమిటీలు లక్ష్యానికి ఆమడదూరంలో ఉన్నాయి. కేవలం 8 శాతం వసూళ్లతో రాప్తాడు కమిటీ అట్టడుగు స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 9 శాతంతో గుత్తి, 11 శాతంతో రాయదుర్గం, 14 శాతం వసూళ్లతో గుంతకల్లు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. కాగా, గతేడాది కూడా ఇదే పరిస్థితి నెలకొన్నా మొదటి నాలుగు నెలల కాలంలో రూ.4.22 కోట్లు వసూలైంది. గతేడాది కన్నా ఈ సారి రూ.66 లక్షల వరకు ఆదాయం తగ్గడం విశేషం.

క్లుప్తంగా

సజావుగా వేలం పాట

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పూజ సామగ్రి విక్రయాలకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలం పాటలో పాల్గొన్న ఓ వ్యక్తి రూ.4.02 లక్షలకు హోమ సామగ్రి, ఇతరత్రా పూజా సామగ్రి విక్రయించేందుకు అనుమతులు పొందినట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి తెలిపారు. వేలంపాట అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ కార్యనిర్వహణ అధికారి రామాంజనేయులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రామకృష్ణ సేవా సమితి వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని శ్రీరామకృష్ణ సేవా సమితి 20వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహిస్తుననట్లు సమితి ప్రతినిధి శ్రీధరమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, సామూహిక విష్ణు సహస్ర నామ స్తోత్ర పఠనం, రామకృష్ణుల కథామృత పఠనం ఉంటాయన్నారు. అనంతరం స్వామి అనుపమానంద మహారాజ అనుగ్రహ భాషణం, నాట్యాచార్యులు సంధ్యామూర్తి శిష్య బృందం నాట్యార్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలి



విలేకరులతో మాట్లాడుతున్న మల్లికార్జున నాయక్

అనంతపురం టవర్‌క్లాక్: గిరిజనులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని గిరిజన ప్రజా సమాఖ్య ఉపాధ్యక్షులు మల్లికార్జున నాయక్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున నాయక్ మాట్లాడుతూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రోజును సెలవు దినంగా ప్రకటించాలన్నారు. గిరిజన హక్కుల కోసం పోరాడిన వారి విగ్రహాలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గిరిజనుల సమస్యలపై ఐకమత్యంగా పోరాటాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు నాయక్, ఆనంద్, రమేష్ నాయక్, భాస్కర్ నాయక్, బాబు నాయక్, ప్రసాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎస్కేయూ ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురం: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని స్ఫూర్తిదాయకంగా నిలిచే స్థాయికి ఎదగాలని ఎస్కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.కృష్ణ కుమారి సూచించారు. సెంట్రల్ స్కూల్‌లో బుధవారం 'విద్యార్థి మండలి ప్రవేశ వేడుక' నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రమశిక్షణ అలవరచుకోవాలన్నారు. అంకితభావంతో కృషి చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ధర్మవరం సబ్ జైలు జైలర్ బ్రహ్మం రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ మార్కండేయులు సూరి పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలనే కొలుద్దాం

అనంతపురం కార్పొరేషన్: రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మట్టి ప్రతిమలనే కొలుద్దామని నగర ప్రజలకు డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నగరపాలక సంస్థలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన వినాయక ప్రతిమలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. నిమజ్జనం రోజున హెచ్ఎల్‌సీ, చెరువుల్లో వదలడం ద్వారా నీరు కలుషితమయ్యే ప్రమాదం లేకపోలేదన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో మట్టి ప్రతిమలను వాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్లు అబూసలేహా, చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

చెన్నేకొత్తపల్లి: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి–2 ప్రసూన్‌కుమార్ నాయుడు సూచించారు. స్థానిక ఏపీ మోడల్‌స్కూల్, కస్తూరి బా గాంధీ బాలికల పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులు, వసతి గృహంలో గదులను పరిశీలించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో పాఠశాల సిబ్బందితో సమావేశమయ్యారు. గురువారం జరిగే ఎస్ఎంసీ ఎన్నికలో ఎలాంటి అవకతవకలు లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని ఏజెన్సీ వారికి సూచించారు. కేజీబీవీలో విద్యార్థినులు పండిస్తున్న ఆకుకూరల తోటను పరిశీలించి వారిని అభినందించారు. నాడు–నేడు కింద జరిగిన పనులను పరిశీలించారు. సిబ్బంది పాల్గొన్నారు.

మేడం చేరక.. సర్టిఫికెట్లు అందక!

- బాధ్యతలు చేపట్టని అనంతపురం రూరల్ తహసీల్దార్
- ఇక్కడ చేరేందుకు అయిష్టత చూపుతున్నట్లు ప్రచారం
- ప్రొటోకాల్‌కు భయపడే ససేమిరా!
- డిజిటల్ 'కీ' లేక నిలిచిపోయిన వివిధ సర్టిఫికెట్లు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు



అనంతపురం తహసీల్దార్ కార్యాలయం

రాప్తాడురూరల్: అతిపెద్ద మండలం. తహసీల్దార్ తన సీటులో ఒక గంట లేకపోతేనే జనాలు బారులు తీరే పరిస్థితి. అలాంటి కార్యాలయానికి అసలు తహసీల్దార్ లేకపోతే ఎంత దారుణంగా ఉంటుందో ఒకసారి అనంతపురం రూరల్ తహసీల్దార్ కార్యాయాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. ఎన్నికల సమయంలో తిరుపతి జిల్లా నుంచి బాలసుబ్రమణ్యంను అనంతపురం రూరల్ మండలానికి కేటాయించారు. ఎన్నికల అనంతరం ఇటీవల తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా ఆయనను అదేజిల్లాకు పంపారు. ఇక్కడకు వాణిశ్రీని నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికి ఆరు రోజులు గడస్తున్నా ఆమె బాధ్యతలు తీసుకోలేదు. అర్బన్ తహసీల్దార్‌గా నియామకం పొందిన హరికుమార్ మూడు రోజుల కిందట చార్జ్ తీసుకున్నారు.

ప్రొటోకాల్‌కు భయపడే..

వాణిశ్రీ బాధ్యతలు తీసుకోకపోవడానికి ప్రధాన కారణం ప్రొటోకాల్ పనులే అని తెలిసింది. జిల్లా కేంద్రంలో నిత్యం ప్రొటోకాల్ విధులు ఉంటాయి. వాటితో పాటు రోజూ వందల సంఖ్యలో సమస్యలపై కార్యాలయానికి వస్తుంటారు. ప్రొటోకాల్ ఖర్చులు ఉన్నతాధికారులు తమపైనే వేస్తుంటారని గతంలో పని చేసిన ఉద్యోగులు చెబుతున్నారు. పని చేసి కూడా తమ చేతుల నుంచి డబ్బు ఖర్చు పెట్టుకోవాలంటే జంకుతున్నారు. ఉన్నతాధికారులు ఇవేవీ పట్టించుకోకుండా ప్రొటోకాల్ చేయమంటూ ఆదేశాలు జారీ చేస్తారని చెబుతున్నారు. ఈ కారణంగానే వాణిశ్రీ భయపడుతున్నట్లు తెలిసింది.

డిజిటల్ 'కీ' లేక నిలిచిపోయిన వివిధ సర్టిఫికెట్లు..

రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో 'డిజిటల్ కీ' లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మీసేవా, సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకున్న వివిధ సర్టిఫికెట్లు మంజూరు చేసేందుకు తహసీల్దార్ డిజిటల్ కీ ద్వారా సంతకం చేయాల్సి ఉంటుంది. కొత్త తహసీల్దార్‌ను నియమించడంతో డిజిటల్ కీ ఆమె పేరు మీద చేయించాల్సి ఉంటుంది. ఆమె బాధ్యతలే తీసుకోకపోవడంతో డిజిటల్ కీ అందుబాటులో లేకుండా పోయింది. ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎవరికీ ఇవ్వలేదు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఇంటిగ్రేటెడ్, ఆదాయం, ఈడబ్ల్యూఎస్, కుల ధ్రువీకరణ పత్రాల కోసం రోజూ వందలాదిమంది దరఖాస్తు చేసుకుంటున్నారు. సర్టిఫికెట్లు మంజూరు కాకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

చక్రం తిప్పుతున్న కంప్యూటర్ ఆపరేటర్

ఇదిలాఉండగా కార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్ చక్రం తిప్పుతున్నాడు. సర్టిఫికెట్లపై తహసీల్దార్ డిజిటల్ సంతకాల కీ వ్యవహారం ఈ ఆపరేటర్ చూసుకుంటాడు. ఈయన చేయి తడిపిన వారి సర్టిఫికెట్లు మాత్రం వెంటనే అప్రూవల్ చేయిస్తాడని చెబుతున్నారు. పట్టించుకోకపోతే రోజుల తరబడి పెండింగ్‌లో పెడుతున్నట్లు తెలిసింది. ఏ తహసీల్దార్ వచ్చినా ఈ కంప్యూటర్ ఆపరేటర్ మీద ఆధారపడడం బాగా కలిసొచ్చింది. దీన్ని ఆసరా చేసుకుని 'క్యాష్' చేసుకుంటున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు.

డిగ్రీ మెగా సప్లి ఫీజులు తగ్గించాలి



ఇన్‌చార్జ్ వీసీకి వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న మెగా సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించిన ఫీజులను తగ్గించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి. అనితకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు సెమిస్టర్ విధానంలో మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. ఒక్కో సబ్జెక్టుకు రూ.2 వేలు, రెండు సబ్జెక్టులకు రూ.3 వేలు, మూడు సబ్జెక్టులకు రూ.4,000 చొప్పున ఫీజు చెల్లించాలని పేర్కొనడం సరికాదన్నారు. కరువు ప్రాంతం కాబట్టి విద్యార్థి తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకుని పరీక్ష ఫీజు తగ్గించాలని కోరారు. అదే విధంగా డిగ్రీ రెండు, నాలుగు, ఐదో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దివాకర్ నాయక్, యుగంధర్ రెడ్డి,బాబు, గురుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సర్ప రూపం.. ముక్తి ప్రదాయం

- నేటి నుంచి నాగుల చవితి వేడుకలు



పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు (ఫైల్)

అనంతపురం కల్చరల్: ప్రత్యక్ష దైవంగా భావించి పూజించే నాగుల చవితి వచ్చేసింది. ఈ శ్రావణమాసంలో ప్రధాన పండుగలు ప్రారంభం కానున్నాయి. గురువారం నాగుల చవితి పర్వదినాన్ని, శుక్రవారం గరుడ పంచమి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునేందుకు జిల్లావాసులు సిద్ధమవుతున్నారు. కళారూపాల ప్రదర్శనల నడుమ వివిధ రథాల రూపంలో నాగల చవితి వేడుకలను నిర్వహించడానికి నగరంలో సన్నాహాలు చేస్తున్నారు.

మాసమంతటా నాగుల పూజలే

సాధారణంగా అన్ని పండుగలు ఒకటి రెండు రోజుల్లో ముగిసిపోతాయి. అయితే నాగుల చవితి వేడుకలు మాత్రం మాసమంతటా జరుపుకుంటారు. ముఖ్యంగా శ్రావణ మంగళ, శనివారాలు చవితి వేడుకలు ఘనంగా జరుగుతాయి. వయసుతో తారతమ్యం లేకుండా అందరూ నాగుల పుట్టల వద్ద పాలు, పండ్లు పోస్తారు. పుట్ట మన్ను శరీర భాగాలకు పూసుకుంటే ఆరోగ్యకరమని భావిస్తారు. నగరంలోని పలుచోట్ల వద్ద వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నాగిన్ ఉత్సవం ప్రత్యేకం..

నగరానికి చెందిన కరణం వెంకట ప్రసాద్ రెవెన్యూ శాఖలో వీఏఓగా పనిచేస్తున్నారు. నాగులపై పరిశోధనలు చేస్తూ పుస్తకాలను రచిస్తుంటారు. ఈ నేపథ్యంలో పన్నెండేళ్ల నుంచి కళా ఉత్సవంగా నాగుల చవితిని నిర్వహిస్తున్నారు. నాగిన్ ఉత్సవంలో కళాకారులు నగరవీధుల్లో కళాజాతను ప్రదర్శిస్తూ నాగుల విశిష్టతను తెలియజేస్తారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో సాంస్కృతిక ఉత్సవాలు, అనంతరం నాగుల రథోత్సవం జరుగుతాయి. సామూహిక లలితా సహస్రనామపారాయణం, నాగుల క్యాలెండర్ ఆవిష్కరణ, శాస్త్రీయ నాట్యాల ప్రదర్శన ఉంటాయి.

వేడుకల్లో పాల్గొనాలి

నాగుల చవితి అంటేనే ధ్యానం, నృత్యం అని నాగశాస్త్రం చెబుతోంది.మనిషిలో ప్రకాశించే ఆత్మ స్వరూపమే నాగదేవతలు. ఓ వైపు నాగులను పూజిస్తూనే పుట్టల్లోకి పాలు, పండ్లు పోస్తూ వాటిని తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాం. పుట్టపైన మాత్రమే పాలు పోయాలి. దశాబ్దాలుగా ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ కళారూపాలు ప్రదర్శిస్తున్నాం. సర్పజాతి విశిష్టతను తెలిపే వేడుకల్లో పాల్గొనండి.

– కరణం వెంకటప్రసాద్, ఉత్సవ నిర్వాహకుడు

ఈ–క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలి



రాచానపల్లిలో ఈ-క్రాప్ నమోదులో పాల్గొన్న ఏఓ జే.శశికళ



ఈ పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి నరసింహారావు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో సాగు చేసిన అన్ని రకాల పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని రూరల్ మండలం వ్యవసాయాధికారి జే.శశికళ రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలో మన్నీల, రాచానపల్లి రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే)ల్లో కౌలురైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. భూ యజమానులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా కౌలుదారులకు న్యాయం జరిగేలా సీసీఆర్‌సీలు అందిస్తామన్నారు. ఒక ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంట వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం నుంచి పలు ప్రయోజనాలు వర్తించే అవకాశం ఉన్నందున ఈ–క్రాప్, ఈకేవైసీ తప్పనిసరి అన్నారు. రాచానపల్లిలో రైతు పీఆర్ చెన్నారెడ్డి వేరుశనగ పొలంలో ఈ–క్రాప్ నమోదును పరిశీలించారు. అన్ని గ్రామాల్లో ఈ ప్రక్రియ మొదలైనందున రైతులు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ మురళీకృష్ణ, ఆర్ఎస్‌కే అసిస్టెంట్లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి సుచరిత సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆమె, మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఈ–క్రాప్ బుకింగ్ తీరును పరిశీలించారు. ఈ–క్రాప్ బుకింగ్ కోసం రైతులు స్థానిక రైతు సేవా కేంద్రానికి వెళ్లి తాజాగా పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ పొందాలని, దాంతో పాటు బ్యాంక్ ఖాతా, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తప్పనిసరిగా వ్యవసాయ సిబ్బందికి అందజేయాలని సూచించారు. దీంతో పలువురు రైతులు బుధవారం ఆత్మకూరులోని రైతు సేవా కేంద్రాల్లో పట్టాదారు పాసు పుస్తకం కోసం అర్జీ అందజేశారు.

ఈ పంట నమోదుతోనే పరిహారం

రాప్తాడు: రైతులు తాము సాగు చేసిన పంటలను ఈ పంట ద్వారా నమోదు చేసుకుంటేనే పరిహారం వస్తుందని జిల్లా ఉద్యాన అధికారి నరసింహారావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గొందిరెడిపల్లిలో జరుగుతున్న ఈ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు ఈ పంట ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంట నష్ట పరిహారాలు అందుతాయని తెలిపారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, వ్యక్తిగత బ్యాంక్ ఖాతా నంబర్, ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి పంట నమోదు చేసుకోవాలన్నారు. గత ఏడాది ఈ పంట ద్వారా నమోదు చేసుకున్న దీర్ఘకాలిక మొక్కలను ఆటోమేటిక్‌గా ఫార్వర్డ్ చేయాలని రైతు సేవా కేంద్రం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి రత్నకుమార్, వీహెచ్ఏ ప్రియ లత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పంపనూరు తండాలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి సబిహా సుల్తానా సూచించారు. బుధవారం ఆమె, మండలంలోని పంపనూరు తండాలో పర్యటించారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల ప్రబలే తీరు, తీసుకోవాల్సిన చర్యల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటి సర్వే చేశారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందించారు. నీటిని ఎక్కువ కాలం నిల్వ చేయకూడదని, నీటిలో లార్వా చేరడం వల్ల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఎవరికి వారు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల బారిన పడకుండా దోమ తెరలు వాడాలన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్ నూర్ బాషా, ఎంపీహెచ్ఓ శేషగిరి, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ అండ్ డీ విభాగం డీన్‌గా శోభాలత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఆర్అండ్‌డీ) విభాగం డీన్‌గా ప్రొఫెసర్ జి.శోభాలత నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ రమేష్ బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపాల్ ఏ.కృష్ణకుమారి ఇన్నాళ్లూ ఆర్అండ్‌డీ డీన్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. రెండేళ్ల పదవీ కాలం పూర్తి కావడంతో ఆ స్థానంలో ప్రొఫెసర్ జి.శోభాలతను నియమించారు. మేథమేటిక్స్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న శోభాలత మంచి పరిశోధకురాలిగా గుర్తింపు పొందారు.

అన్ని సచివాలయాల్లో టీకాల పంపిణీ చేపట్టాలి



38వ డివిజన్‌లో టీకాల పంపిణీని పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ప్రతి సచివాలయంలో వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మేయర్ వసీం అధికారులను ఆదేశించారు. బుధవారం 38వ డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన టీకాల పంపిణీ కార్యక్రమాన్ని మేయర్ పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులకు టీడీ వ్యాక్సిన్ అందిస్తున్నట్లు సిబ్బంది మేయర్‌కు వివరించారు. కొన్ని సచివాలయాల్లో మాత్రమే టీకాల పంపిణీ జరుగుతోందని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటుతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు మేయర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన మేయర్ చిన్నారులు, గర్భిణులకు టీకాలు పక్కాగా అందేలా సచివాలయాల్లోనే పంపిణీ ప్రక్రియ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, కార్పొరేటర్ ఇసాక్, నాయకులు కిషోర్ పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని బుధవారం అమరావతిలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిశారు. సమస్యలపై చర్చించారు. విద్యార్థులకు సీట్ల సంఖ్య పెంచాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేసే వారికి పీఆర్సీ ప్రకారం జీతాలు అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లిలో అసంపూర్తిగా ఉన్న గిరిజన సాంఘిక సంక్షేమ పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షులు ఆదిశేషయ్య ఉన్నారు.

పూడిక తీశారు.. వదిలేశారు!



నడిమివంకలో తొలగించిన పూడికను ఎత్తివేయకుండా వదిలేసిన దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఇంజినీర్ల నిర్లక్ష్యం కారణంగా పూడిక తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత నెలలో నగరంలోని నడిమివంక, మరువంక తదితర ప్రాంతాల్లో పూడికతీత పనులు చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులు టెండర్లను ఆహ్వానించారు. టెండర్ దక్కించుకుని పూడికతీత పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ఆ తర్వాత కంపోస్టుకు తరలించలేదు. నగరపాలక సంస్థ ఇంజినీర్లు బాధ్యతా రాహిత్యంతో ఈ విషయం గురించి పట్టించుకోవడం లేదు. దీంతో పూడికను తీసిన వెంటనే కంపోస్టుకు తరలించకుండా అక్కడే వదిలేస్తున్నారు. ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో మళ్లీ ఆ పూడిక వంకలో కలసిపోయే అవకాశం ఉంది. ఇదే జరిగితే ప్రజాధనం వృథా అయినట్లే. ఇప్పటికైనా నగరపాలక సంస్థ ఇంజినీర్లు ప్రత్యేక దృష్టి సారించి, పూడిక తీత, తరలింపు పనులు పక్కాగా చేపట్టేలా చూడాల్సి ఉంది.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగరత్న

రాప్తాడు: తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని పాలచెర్ల అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన మరుక్షణం నుంచే ముర్రుపాలు పట్టించాలన్నారు. అన్ని రకాల పోషక విలువలు కలిగి, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. 6 నెలల నిండిన చిన్నారులకు తల్లిపాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో అనుబంధమైన పోషకాహారాన్ని అందించాలన్నారు. తల్లిపాలలో ఉండే పోషకాలు ఇతర ఏ ఆహారంలోనూ లభించవన్నారు. అవి బిడ్డ ఎదుగుదలకు ఎంతో దోహదపడతాయన్నారు. ఏటా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం చిన్నారులు, గర్భిణులు, బాలింతలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, ఏఎన్ఎం రజిని, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, వరలక్ష్మీ, గర్భిణులు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు

వీడీ తండాలో తల్లిపాల వారోత్సవాలు

ఆత్మకూరు: మండలంలోని వేపచెర్ల దిగువ తండా (వీడీ తండా) గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి గర్భవతులు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బాలయోగి మహారాజ్ ఆరాధన

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో బుధవారం తపఃసిద్ధి వేడుకలు ఘనంగా జరిగాయి. 12 ఏళ్ల పాటు తపమాచరించి శివ సాక్షాత్కారంతో శివైక్యమైన బాలయోగి మహారాజ్ మూలవిరాట్టును సుగంధ ద్రవ్యాలతో భక్తులే పూజించుకున్నారు. అనంతరం సామూహిక భజనలు, స్వామివారికి ఊంజల్ సేవ, విశేష పుష్పార్చన కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యంగా ధ్యానదీక్షా కార్యక్రమం ఆలోచనాత్మకంగా సాగింది. మధ్యాహ్నం మహామంగళహారతి, అన్న సంతర్పణ, ప్రసాద వితరణ జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు జూటూరు అరవింద్, రత్నగిరి దేవరాజ్, సురేష్, లక్ష్మీనారాయణ, చెన్నకేశవులు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకున్న శ్రీవారు



కోలాటమాడుతున్న మహిళలు



కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులుకు సన్మానం

కమనీయం.. శ్రీవారి కల్యాణోత్సవం

అనంతపురం కల్చరల్: స్థానిక పాతూరు శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో బుధవారం శ్రీవారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. తిరుమల రీతిలో అష్టోత్తర కలశాభిషేకం, తోమాల సేవ, అష్టదళ పాద పద్మారాధన, తిరుప్పావడ సేవ, డోలోత్సవం, సహస్రదీపార్చన, క్షీరాభిషేకం కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. వేదపండితులు సంప్రదాయబద్ధంగా పరిణయ మహోత్సవాన్ని నిర్వహించారు. మహిళలు హారతులు పట్టి కోలాటంపై భక్తిగీతాలను పాడుతూ నీరాజనాలర్పించారు. స్వామివారి నామస్మరణతో మార్మోగించారు. కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గోపా మచ్చా నరసింహులు, పాతూరు సంఘం అధ్యక్షులు పిన్ని నాగరత్నం ఆత్మీయ అతిథులుగా విచ్చేసి వాసవీ మహిళా మండలి ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో వాసవీ మహిళా సంఘం, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.